ఎమ్మెల్యే హరీశ్‌రావుకు శుభాకాంక్షల వెల్లువ

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న మహిళా విభాగం నేతలు

సిద్దిపేట,ఆగస్టు19 : రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని సిద్దిపేట బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం నేతలు హైదరాబాద్‌కు తరలివెళ్లి మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా అన్నా, చెల్లెళ్ల అనుగరాగాలకు ప్రతీకైన రక్షబంధన్ రోజు ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాఖీ కట్టడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

కొండపాక(కుకునూరుపల్లి) : ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న ఎన్ఆర్‌జీఎస్‌స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు కోల సద్గుణ

కొండపాక : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి రాఖీ కడుతున్న కోల సద్గుణ

కలెక్టర్‌కు రాఖీ కట్టిన బాలసదనం బాలికలు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 19 : రాఖీ సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలసదనం బాలికలు కలెక్టర్ మనుచౌదరికి రాఖీలు కట్టారు. రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం బాలసదనం చిన్నారులతో సందడిగా మారింది. కలెక్టర్ ప్రతి చిన్నారికి స్వీట్స్ తినిపించి ఆశీర్వదించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్‌రెడ్డికి, జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు, గ్రీవెన్స్‌లో వివిధ శాఖల అధికారులకు చిన్నారులు రాఖీ లు కట్టారు.

కలెక్టర్ మనుచౌదరి కి రాఖీ కడుతున్న బాలసదనం బాలికలు

మరకత శివాలయానికి వెండితొడుగు అందజేత

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 19 : హుస్నాబాద్ పట్టణంలోని పురాతనమైన శ్రీభవానీ సహిత మరకత లింగేశ్వరస్వామి ఆలయానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతరావు కుమారులు మూడున్నర కిలోల వెండితో తయారు చేయించిన తొడుగు అందజేశారు. అనంతరం ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనిత, ఆలయకమిటీ చైర్మన్ అయిలేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ వల్లపు రాజు, ఆలయకమిటీ సభ్యులు కొత్తపల్లి అశోక్, ఆంజనేయులు, మైదంశెట్టి వీరన్న తదితరులు ఉన్నారు.

మరకత లింగేశ్వరస్వామికి వెండితొడుగును తీసుకువస్తున్న సంజీవరావు తదితరులు

చందాపూర్‌కు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

వర్గల్, ఆగస్టు19 : వానొచ్చినా? వరదొచ్చినా వర్గల్ మండలం చందాపూర్ గ్రామానికి వెళ్లాలంటే సీతకష్టమే మరీ ! వానొస్తే నేమో రోడ్డుమార్గమంతా బురదమయం. వరదొస్తేనేమో వాగుదాటనీయదు. ఇది ఆ గ్రామస్తుల పరిస్థితి. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో రూ.80 లక్షలతో వాగుపై బ్రిడ్జి నిర్మాణం మొదలుకు శ్రీకారం చుట్టినా అప్పటి కాంట్రాక్టు పనులు చేపట్టకపోవడంతో బ్రిడ్జి నిర్మాణం చందాపూర్ గ్రామస్తులకు అందని ద్రాక్ష అయ్యింది. కాగా మాజీ ఎంపీపీ లతా రమేశ్ గౌడ్ సొంత డబ్బులతో దాదాపు రూ. లక్షా 30 వేలతో వాగుమార్గానికి మరమ్మతులు చేసినా ఇటీవల మూడురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వరదనీటి తాకిడికి రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పటికైనా వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వరదకు కొట్టుకుపోయిన రోడ్డుమార్గం

ప్రజా సేవకు పాటు పడుతా..

బీఆర్ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి

తొగుటలో మహిళలకు వాటర్ క్యాన్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు టీచర్ నర్సింహారెడ్డి

తొగుట, ఆగస్టు 19 : ప్రజా సేవకు తన వంతు కృషి చేస్తున్నానని తొగుట బీఆర్ఎస్ నేత నర్సింహారెడ్డి అన్నారు. తొగుటలో సోమవారం ఇంటింటికీ మంచినీటి క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్లను ఇంటింటికీ పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

దుబ్బాకలో విచారిస్తున్న ఏసీపీ మధు

దుబ్బాక, ఆగస్టు18 : దుబ్బాకలో ఈ నెల 13న తైబజార్ నిర్వాహకుడిపై దాడి చేసి, దూషించిన సంఘటనలో ఎస్సీఎస్టీ కేసు నమోదైంది. ఈ విషయంపై సోమవారం దుబ్బాక పోలీసు స్టేషన్‌ను సిద్దిపేట ఎసీపీ మధు సందర్శించి, విచారణ చేపట్టారు. దుబ్బాక పట్టణంలో బస్టాండ్ ఎదురుగా బాలాజీ గోవింద్ మిఠాయిభండార్ దుకాణం వద్ద తైబజార్ వసూలుకు వెళ్లిన బవాజీ రమేశ్‌పై స్వీట్ దుకాణం యజమాని మోహన్ లాల్ అతడి భార్య మేకుదేవి, మరోవ్యక్తి దేవారం దూషించి, దాడి చేశారు. ఈవిషయంపై ముగ్గురిపై ఎస్సీఎస్టీ కేసు నమదయ్యింది. ఏసీపీ మధు వారిని విచారించడంతో పాటు సంఘటన స్థలానికి వెళ్లి ప్రత్యేక్ష సాక్షులను విచారించారు. ఆనంతరం పోలీసు స్టేషన్‌లో పలు రికార్డులను ఆయన పరిశీలించారు.

రాఖీ కట్టిన మహిళా కానిస్టేబుల్

దుబ్బాక పోలీసు స్టేషన్ సందర్శించిన ఏసీపీ మధుకు మహిళా కానిస్టేబుళ్లు రాఖీ కట్టి , రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగరాజు ఉన్నారు.

చేర్యాల: జనగామ ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డికి రాఖీ కడుతున్న చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి

హుస్నాబాద్‌టౌన్: రక్షాబంధన్ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు

మిరుదొడ్డిలో అన్నదమ్ములకు రాఖీలు కడుతున్న తోబుట్టువులు

దుబ్బాక శివమార్కండేయ దేవాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి

కొమురవెల్లి : రాఖీ కట్టి తమ్ముళ్లకు స్వీటు తినిపిస్తున్న సోదరి

మద్దూరు: గాగిళ్లాపూర్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరిమణులు

రాఖీ కట్టి.. ఆత్మీయతను పంచి

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

సోదర, సోదరి ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండుగ.. సోమవారం సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆడ పడుచులు తమ సోదరులకు రాఖీలు చుట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు తమ సోదరీలకు కానుకలు అందజేశారు. రాఖీ పండుగతో పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది.

-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, ఆగస్టు 19

సిద్దిపేట : మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సుకు రాఖీ కడుతున్న సోదరీ మణులు

సిద్దిపేట టౌన్ : అన్నలకు రాఖీ కడుతున్న చెల్లెలు

సిద్దిపేటలో మొక్కకు రాఖీ కట్టి వృక్షాబంధన్ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు

తొగుట : అన్నకు రాఖీ కడుతున్న సోదరి

వర్గల్ నవోదయలో రాఖీ సంబురాలు

పద్మశాలీల శోభాయాత్ర

శోభాయాత్రలో పద్మశాలీ నేతలు

సిద్దిపేట టౌన్,ఆగస్టు 19 : సిద్దిపేట పద్మశాలీ సమాజం ఆధ్వర్యంలో రాఖీ పండుగను పురస్కరించుకొని నూలుపోగు పౌర్ణమిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ దేవాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా చేనేత శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సమాజం అధ్యక్షుడు రాజేశం, మల్లికార్జున్, అశోక్, బాల్‌రాజు, భాస్కర్, శ్రీనివాస్, నర్సింహులు, రవి తేజ, సురేశ్, గణేశ్, ఆంజనేయులు, మురళి, కన్నయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట కరాటే మాస్టర్స్‌కు జపాన్ డిప్లామా సర్టిఫికెట్లు

సిద్దిపేట కమాన్, ఆగస్టు 19 : జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా 16వ నేషనల్ మాన్‌సూన్ సీజన్ కరాటే ప్రత్యేక శిక్షణ తరగతులు ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు జరిగాయి. ఈ శిక్షణ తరగతులకు సిద్దిపేటకు చెందిన మాస్టర్స్ రామినీ భాగ్యరాజ్, రాచకొండ అంజనేయులు హాజరై ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ జపాన్ డిప్లామా సర్టిఫికెట్స్ సాధించారు. వీరికి జపాన్ మాస్టర్ షిహాన్ టకుయా తనియామా సర్టిఫికెట్స్ అందజేశారు. మాస్టర్లు ఇండియా చీఫ్ షిహాన్ ఆనంద్ రత్న, సౌత్ ఇండియా చీఫ్ సెన్సయ్ రాపో లు సుదర్శన్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్‌తో ఆంజనేయులు, భాగ్యరాజ్

వైభవంగా సంతోషిమాత పుట్టిన రోజు వేడుకలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 19 : సిద్దిపేట పట్టణంలో వెలసిన సంతోషిమాత ఆలయంలో అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

బస్సు డ్రైవర్‌కి గాయాలు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 19 : హైదరాబాద్ నుంచి వస్తున్న లారీ, బస్సు కొండపాక మండలం నాగులబండ ఎల్వీప్రసాద్ కంటి దవాఖాన వద్ద సోమవారం సాయంత్రం ఢీకొన్నాయి. లారీని ఓవర్ టేక్ చేయబోయిన జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఈ ఘటనలో బస్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణితో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు19 : ప్రజావాణిలో వచ్చే అర్జీదారుల సమస్యలు అధికారులు ప్రత్యేక చొరవ చూపి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తమ తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణికి భూ సంబంధిత, ఇండ్లు, ఆసరాపింఛన్లు గురించి వచ్చిన ఎనిమిది దరఖాస్తులు స్వీకరించారు. డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 19 : విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ పోలీస్ సిబ్బందికి సూచించారు.ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ట్రాఫిక్ విధులు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. నిబంధలను అతిక్రమించే వారిపై కేసులను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై గోపాల్‌రెడ్డి, ఏఎస్సైలు ఉమేశ్, సదాశివరావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

బాలుడికి ఆర్థిక సాయం

సిద్దిపేట టౌన్,ఆగస్టు 19 : సిద్దిపేట ఆదర్శ నగర్ కాలనీకి చెందిన కర్ణకంటి జెర్నియా అనే బాలుడు బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. ఆ బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం గ్రేటర్ క్రాంతి ఫౌండేషన్, జీ 5 టౌన్‌షిప్ సంస్థ వారు రూ. 10 వేలు సోమవారం జెర్నియా కుటుంబ సభ్యులకు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఘనంగా కర్ర శ్రీహరి పుట్టిన రోజు వేడుకలు

కోహెడ, ఆగస్టు 19 : కోహెడ మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే భవనంలో సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా సన్మానించారు. సంకల్ప సంస్థ అధ్యక్షుడు వలుస సుభాష్, జాలిగాం శంకర్, కొక్కుల సురేశ్, ఆవుల మహేందర్, తిప్పారపు శ్రీకాంత్, కర్ర భిక్షపతి, పున్నం రాజు, తిప్పారపు శ్రీకాంత్, అబ్దుల్ రహీం, మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, బండ వెంకటస్వామి, పోలవేని కుమార స్వామి, బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట, ఆగస్టు 19 : సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రేరణ పాండా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ప్రసన్న రాణి బదిలీపై వెళ్లగా కమిషనర్‌గా వచ్చిన బి.సంధ్య బాధ్యతలు స్వీకరించక పోవడంతో అమె స్థానంలో సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో డీఈ గా పనిచేస్తున్న ప్రేరణ పాండాకు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. సోమవారం పూర్తి స్థాయి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

కిష్టంపేటలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజుగౌడ్

కొమురవెల్లి, ఆగస్టు 19 : మండలంలోని కిష్టంపేటలో గ్రామస్తులకు సోమవారం కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్, సిబ్బందితో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చే లింకులను క్లిక్ చేయొద్దని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ వివరాలు తెలుపవద్దన్నారు. ఓఎల్ఎక్స్ వంటి యాప్‌లతో తక్కువ ధరకు వచ్చే వస్తువులను చూసి మోసపోవద్దన్నారు. మాజీ సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు19 : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రత పాటించాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. సోమవారం మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామాన్ని ఎంపీడీవో సందర్శించారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని, మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. విద్యుత్ వైర్లకు చెట్లు అడ్డువస్తున్నాయనే కారణంతో చెట్లను నరకవద్దని, అవసరమైన చోట్ల చెట్ల కొమ్మలను మాత్రమే నరకాలని విద్యుత్ అధికారులకు ఎంపీడీవో సూచించారు.

భారత్ బంద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మిరుదొడ్డి, ఆగస్టు 19 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి తలపెట్టిన భారత్ బంద్‌ను మాల కుల సంఘం నాయకులు విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మిరుదొడ్డిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మిరుదొడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న బుట్టి సత్యనారాయణ

చేర్యాల, ఆగస్టు19 : ఎస్సీ వర్గీకరణ చేసుకునేందుకు రాష్ట్రాలకు స్వేచ్ఛను కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దేశవ్యాప్తంగా దళిత సంఘాలు ఇచ్చిన భారత్ బంద్‌ను మాల, మాల ఉపకులాలు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ కోరారు. సోమవారం చేర్యాల పట్టణంలోని మాల భవనంలో మాల మహానాడు నాయకులు సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకునేంతవరకు పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కమలాపురం కిష్టయ్య, రిటైర్డ్ టీచర్ గుస్క రామదాసు, పుట్ట యాదయ్య, ఉద్యోగులు కాటం శ్రీనివాస్, రవీందర్, రమేశ్, పృథ్వీ రాజ్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాం వెంకటేశ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చందశ్రీకాంత్ న్యాయవాదులు వెంకటేశ్, రవి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగలున్నారు.. అప్రమత్తంగా ఉండండి

వర్గల్, ఆగస్టు 19 : గ్రామాల్లో అపరిచితుల సంచారం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బేగంపేట ఏఎస్సై అమృత్ మీడియాతో తెలిపారు. ఇటీవల ఆయాప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న సంఘటనపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల పనితీరును సమీక్షించుకోవాలని, ఎవరైనా పొరుగు ఊరుకు వెళ్లితే డబ్బు, బంగారం గానీ ఉన్నట్టయితే బ్యాంక్ లాకర్లల్లో పెట్టివెళ్లాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల సమాచారం లేదా అనుమానం ఉంటే 100కు లేదా బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

దంచికొట్టిన వాన

కొమురవెల్లి, ఆగస్టు 19 : కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. దీంతో చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరడంతో రోడ్లపై వర్షం నీళ్లు ఆగడంతో బాటసారులు ఇబ్బంది పడ్డారు. కొన్ని రోజులుగా ఉక్కపోత ఇబ్బంది పడిన ప్రజలు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. రైతులు సంతోషం వ్యక్తం చేశారు.